క్లుప్తంగా

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మేడికుందా గ్రామంలోని పలు చోట్ల సీసీ రోడ్ల నిర్మాణ పనులు బుధవారం ఎంపీడీఓ అంజయ్య ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కచూర్‌రావు, మాజీ ఎంపీటీసీ శంకరప్ప, మాజీ సర్పంచ్ నాగయ్య పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజాదరణ

జిల్లా కార్యదర్శి అరుణ కౌలాస్



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ

జహీరాబాద్: ప్రజల్లో బీజేపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అరుణ కౌలాస్ అన్నారు. బుధవారం కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనతో అన్ని వర్గాల ప్రజలు బీజేపీపై సానుకూలంగా ఉన్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దీనిని తమకు అనుకులంగా మార్చుకోవాలని సూచించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు వైద్యనాథ్, నాయకులు నాగరాజు, రామరాజు, శివకుమార్, శంకర్‌రెడ్డి, సుభాష్ రెడ్డి, విజేందర్, వంశవర్ధన్‌రెడ్డి, భిక్షపతి, శ్రీనివాస్, శ్రీకాంత్, మల్లేష్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తీర్చండి

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డిలో నీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కల్హేర్ మండల పరిషత్తులో జూనియర్ సహాయకులు పరమేశానికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు అభిలాస్, అరవింద్, నర్సింలు, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న రాజు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరిశ్రమ యాజమాన్యాలు ప్రోత్సాహం అందిస్తున్నాయి. బొల్లారం మున్సిపాలిటీలో బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక సాయి లైఫ్‌సైన్స్ పరిశ్రమ మేనేజర్ కెఆర్‌కె రాజు బుధవారం రూ.45 వేలు విలువచేసే నోటు పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాధానోపాధ్యాయులు అంజయ్య పరిశ్రమ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం శశిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

జహీరాబాద్: పట్టణంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదర్శనగర్‌లోని ఉజ్వల్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి కేక్ కట్‌చేశారు. ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావం నుంచి విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తూ వస్తోందన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబీన్, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఉన్నారు.

మత రాజకీయాలను అడ్డుకోవడమే లక్ష్యం

రాజ్యాంగ పరిరక్షణ కోఆర్డినేటర్ ధనలక్ష్మి

కల్హేర్(నారాయణఖేడ్): బీజేపీ మత రాజకీయాలను అడ్డుకోవడానికే రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను చేపడుతున్నట్లు నారాయణఖేడ్, జహీరాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ జూలూరి ధనలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బీబీపేట్, ఫత్తేపూర్‌లో పాదయాత్ర చేపట్టారు. రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేడ్కర్ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటూ సమాన హక్కులు కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పోచయ్య, మాజీ ఎంపీపీ మల్లేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలు.. జనం బెంబేలు



పాతసంగారెడ్డిలోని ఓ మెడికల్ షాపులోని సీసీ కెమెరాలో రికార్డు అయిన దొంగతనం దృశ్యాలు

ఔషధ దుకాణాలే లక్ష్యంగా చోరీలు

- పోలీసులకు సవాల్‌గా మారిన కేసులు
- పట్టణంలో పెరుగుతున్న క్రైమ్‌రేటు

సంగారెడ్డి క్రైమ్: జిల్లా హెడ్ క్వార్టర్స్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు రోజురోజుకి పెరిగిపోతుండటంతో అటు ప్రజల్లోనూ, ఇటు వ్యాపారస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని దుకాణ సముదాయాల్లో ఔషధ దుకాణాలను లక్ష్యంగా చేసుకొని దొంగలు రెచ్చిపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో ఐదు నుంచి ఆరుసార్లు ఔషధ దుకాణాల్లోనే దొంగతనం జరిగిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల కాలంలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న దుకాణాలే చోరీకి గురికావడం స్థానికులను కలవరం పెడుతోంది. దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులను పట్టుకోవడం పట్టణ పోలీసులకు సవాలుగా మారుతుంది. కేవలం కేసులు నమోదు తప్ప రికవరీపై దృష్టి సాధించడం లేదని పట్టణ ప్రజలు పోలీసులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దర్యాప్తు ముమ్మరం చేస్తున్నాం



ప్రధాన రహదారుల్లో గస్తీ ముమ్మరం చేశాం. పట్టణంలో వరుస చోరీల నేపథ్యంలో నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, గాలింపు చర్యలు చేపట్టాం. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేసేలా చూస్తాం.

– పట్టణ సీఐ రమేష్

పెరిగిన క్రైమ్‌రేటు

మరోవైపు అపార్ట్‌మెంట్‌లోకి చొరబడి బంగారు ఆభరణాలు, రైస్‌మిల్‌లో చొరబడి లక్షల రూపాయలు నగదు దోచుకెళ్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. నెల వ్యవధిలో పట్టణంలో ఒకేచోట ఆరుకు పైగా దొంగతనాలు జరిగినా ఇంకా ఆ కేసులు మిస్టరీగానే ఉన్నాయి. పట్టణ పోలీసులు బందోబస్తు పేరుతో విధులు విస్మరిస్తుండటంతో దొంగలు పక్కాగా రెక్కి చేసి, సులభంగా చోరీలకు పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు పోలీస్ సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి, చోరీలకు కళ్లెం వేయాల్సిన అవసరం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారస్తులు భయంతో వ్యాపారం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పోలీసులు నిందితులను వెంటనే అరెస్ట్ చేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

అలరించిన 'అర్జున విజయం' నాటకం

కంగ్టి(నారాయణఖేడ్): జిల్లాలోని కంగ్టి మండలం దామరగిద్దా గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలు పురస్కరించుకొని మంగళవారం రాత్రంతా అర్జున విజయం నాటకం కొనసాగింది. గ్రామానికి చెందిన చెలంద్రి గుండయ్య మాస్టారు నాటకంలోని పాత్రలు, సన్నివేశాలు, డైలాగులు తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వగా స్థానికుల సహకారం విశేషంగా లభించింది. గ్రామానికి చెందిన మీరేసాబ్ ధృతరాష్ట్రుడుగా, ఇమాంసాబ్ ద్రౌపతి పాత్రల్లో అందరిని ఆకర్షించి మన్ననలు పొందారు. నాటకంలో కౌరవ సభ, పాండవ సభను తిలకించడానికి ప్రజలు సాయంత్రం నుంచే తమ స్థానాలు రిజర్వు చేసుకోవడానికి పోటీ పడడంతో జనాలతో రంగస్థల ప్రాంగణం కిక్కిరిసింది. పాత్రల్లో తమకు నచ్చిన వారికి ప్రేక్షకులు నజరానాలు ప్రకటించడంతో నాటకంలోని పాత్రదారుల్లో ఉత్సాహం కనిపించింది. కొందరు వెండి ఉంగరాలు పాత్రదారులకు తొడగడం, డబ్బులు ఈనాంగా ప్రకటించడంతో ఉత్సాహభరిత వాతావరణం కనిపించింది.



పాండవులు సయోధ్య సన్నివేశం

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం .. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టు లో హాజరుపర్చగా 09 మందికి రూ.2 వేల చొప్పున, ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమా నా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం

కంగ్టి(నారాయణఖేడ్): సంగారెడ్డి జిల్లా కంగ్టి శివారులోని శ్రీ సిద్దేశ్వర ఆలయం భూములు కౌలుకు ఇచ్చేందుకు గురువారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శివరుద్రప్ప పేర్కొన్నారు. స్థానిక గణేష్ మందిరంలో మ.12 గంటలకు నిర్వహించే బహిరంగ వేలం పాటలో రైతులు పాల్గొనాలని సూచించారు. ఈ వేలం నిర్ణయం రాబోయే రెండేళ్ల వరకు వర్తిస్తుందని తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పరమేశంను కాంగ్రెస్ జిల్లా యువనాయకులు నరేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భూసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో తులసిదాస్, గోవర్ధన్ గౌడ్, యాదగిరి, వీరస్వామి, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రేజింతల్లో రూ .26.50 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఆశిరెడ్డి, మాణిక్‌రెడ్డి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు సిద్ధన్న, సత్యనారాయణ నాయకులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



జహీరాబాద్ టౌన్: తహసీల్దార్ కార్యాలయం వద్ద..

నారాయణఖేడ్: పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డిజీల్ ధరలను తగ్గించాలని బుధవారం ఖేడ్‌లో సీపీఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను రాజీవ్‌చౌక్‌లో దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ధరలను తగ్గించని పక్షం పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి ఆనంద్, నాయకులు చిరంజీవి, అశోక్, దత్తురెడ్డి, పుప్పాల అశోక్, సతీష్, సంజీవ్, నారాయణ పాల్గొన్నారు.

పేదలపై భారం తగదు

జహీరాబాద్ టౌన్: పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు మహిపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా పనిచేస్తుందన్నారు. అందుకు పేదలపై భారం మోపుతుందని ఆరోపించారు. వెంటనే ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొడి నర్సింలు, దుర్గప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం

కాంగ్రెస్ నాయకులు

న్యాల్‌కల్ (జహీరాబాద్): ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా అమలు చేస్తోందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం న్యాల్‌కల్‌లో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృతనిశ్చయంతో ఉందన్నారు. అల్లాదుర్గం–మెటల్‌కుంట రహదారిని ఆరులైన్లుగా మార్చేందుకు సర్వే కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సిద్ధి లింగయ్యస్వామి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గిరీష్‌రావు, అడివప్ప, పంచాయతీ కార్యదర్శి ధన్‌రాజ్ ఉన్నారు.



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. బుధవారం బుధవారం మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డిలు చెక్కులు అందజేశారు. మంత్రి దామోదర సహాయంతో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, ఎంపీడీఓ హరినందన్‌రావు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్: మనూరు మండలం తోర్నాల్‌కు చెందిన కోటరి మాణిక్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. అతనికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.40,500 చెక్కు మంజూరయింది. బుధవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సంబంధిత చెక్కును బాధితుడికి అందజేశారు. బీఆర్ఎస్ ఖేడ్ పట్టణ అధ్యక్షుడు నగేష్, కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు మల్గొండ, నాయకులు గోపాల్, మోసిన్, దత్తుపటేల్, కాశీనాథ్, లాలప్ప పాల్గొన్నారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

పటాన్‌చెరు: నిరుపేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన హంసమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ. 4 లక్షల విలువైన ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందచేశారు. జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

◆ పాదయాత్ర

రామచంద్రాపురం(పటాన్ చెరు): పటాన్‌చెరు బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ఎన్నికైన సందర్భంగా వి.ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రామచంద్రాపురం పట్టణం నుంచి రుద్రారం గణేష్ గడ్డ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు రెడ్డి, నాయకులు కుమార్ గౌడ్, సంపత్, రాణి యాదవ్, నవీన్, నాయకులు పాల్గొన్నారు.

◆ నేడు నేరడిగుంట సంత వేలం

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలో రెండవ పెద్ద సంత నేరడిగుంట సంత. 2025–26 సంవత్సరానికి సంబంధించి గురువారం గ్రామ స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ ఆవరణలో ఉ.10 గంటలకు తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి నర్సింహాస్వామి పేర్కొన్నారు. వేలం పాట దక్కించుకున్న వారు ఒకేసారి మొత్తం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పోషకాహార లోపం తగ్గించడమే లక్ష్యం

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: పిల్లలలో పోషకాహార లోపాలను తగ్గించటమే 'పోషణ పక్షం' కార్యక్రమం లక్ష్యమని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పోషణపక్షంపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పోషణపక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పోషకాహార లోపాన్ని తగ్గించటం ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. పిల్లల్లో రక్తహీనత, తక్కువ బరువుతో జననాలు తగ్గించవచ్చని తెలిపారు. ఈ నెల 22 వరకు జిల్లా వ్యాప్తంగా పోషణ పక్షం కార్యక్రమాలను నిర్వహించి, పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, డీఆర్డీఓ జ్యోతి, జిల్లా వైద్యాధికారి డా.గాయత్రిదేవి, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, జిల్లా వ్యవసా యాధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

మరమ్మతు పనులు ప్రారంభం



మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): మండలంలోని ఉసిరికపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవనం మరమ్మతు పనులను కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మెట్టు శ్రీనివాస్ ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద రూ.2.5 లక్షల నిధులతో మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు. ఎన్నికల సమయంలో మంత్రి దామోదర ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబయ్య, ఉపాధ్యక్షుడు రమేశ్, మల్లయ్య, కిష్టయ్య, శ్రీశైలం, విఠల్, పెంటయ్య పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతాం

న్యాల్‌కల్(అందోల్): ఇచ్చిన హామీలన్నీటిని దశలవారీగా నెరవేర్చనున్నట్లు జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మల్లేశ్ గంగ్వార్ పేర్కొన్నారు. బుధవారం ముఖ్యనాయకుల సమావేశం న్యాల్‌కల్ గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అల్లాడి బక్కయ్య గుప్తా, జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బక్కయ్య గుప్తా మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

ఊరూరా కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీలు



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో బుధవారం ర్యాలీలు నిర్వహించారు. చిరాగ్‌పల్లి, బుర్దిపాడ్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి ఆధ్వర్యంలో జైభీ, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర బీజేపీ ప్రభుత్వం వ్యవరిస్తున్న తీరు రాజ్యాంగాన్ని ముప్పు తెచ్చేలా ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకురావాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చారిత్రాత్మక విజయాల పునాదిగా గోల్డెన్ జూబ్లీ

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్: గత చారిత్రాత్మక విజయాల పునాదిగా గోల్డెన్ జూబ్లీ దిశగా ఐక్యతగా కొనసాగుదామని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు కార్మికులకు పిలుపునిచ్చారు. సీఐటీయూ అనుబంధంగా స్థాపించిన శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 40 వ వార్షికోత్సవాన్ని పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13న ఆదివారం కర్దనూర్ జేపీ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించే వార్షికోత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. ఏడాది పొడవునా నిర్వహించిన వాలీబాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, వ్యాస రచన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శాండ్విక్ యూనియన్ నాయకులు పాండురంగారెడ్డి, మనోహర్, వీరరావు, సదాశివరెడ్డి, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కారాములు

పత్రాల జారీలో జాప్యం.. పరేషాన్‌లో జనం

- పక్షం రోజులు గడిచినా చేతికందని కుల, ఆదాయ ధ్రువపత్రాలు
- రాజీవ్ యువ వికాసం దరఖాస్తులకు ఐదు రోజులే గడువు
- రెవెన్యూ అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయ పరిధిలో జనన, కుల, స్థానిక ఆదాయ ధ్రువపత్రాల జారీలో తీవ్రజాప్యం చేస్తూ మండల ప్రజలను రెవెన్యూ అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. వారం రోజుల వ్యవధిలో చేతికి అందాల్సిన ధ్రువపత్రాలు రెండు వారాలు దాటిన అందడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మీ సేవా, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇరవై రోజులు గడిచినా జనన ధ్రువీకరణ పత్రం, పదిహేను రోజులు గడిచినా కుల, ఆదాయ పత్రాలు ఆన్‌లైన్‌లో రావడం లేదని పలువురు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మీసేవాలో దరఖాస్తులు చేసుకున్న తర్వాత తహసీల్ కార్యాలయంలో సంప్రదిస్తే దురుసుగా సమాధానం ఇస్తూ తిప్పించుకుంటున్నారని వాపోయారు. రాజీవ్ యువవికాసానికి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14 వరకే గడువు ఉండడంతో ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై యువకులు ఆందోళన చెందుతున్నారు. ఆదాయం వచ్చే పనులపైనే తహసీల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది దృష్టి పెడుతున్నారని మిగతా పనులపై నిర్లక్ష్యం వహించడంతో ధ్రువపత్రాల జారీ జాప్యానికి కారణమని పలువురు బహిరంగంగానే అధికారులపై ఆరోపణలు గుప్పిస్తున్నారు.

రాజీవ్ యువ వికాసానికి సర్టిఫికెట్ల గండం..

స్వయం ఉపాధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరిట రుణాల ప్రకటనపై యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయినా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ జాప్యం అవుతుండటం తీవ్ర మనస్తాపానికి గురిచేస్తోంది. దీంతో మీసేవా, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. యువకులే కాకుండా ఉపాధి లేని మధ్య వయస్కులు కూడా రుణాలు పొంది ఉపాధి పొందడానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఓ వైపు ధ్రువపత్రాల జారీ జాప్యం మరోవైపు దరఖాస్తు గడువు తేదీ దగ్గరపడుతుండటంతో యువత ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆదాయ, కుల పత్రాలను వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ధ్రువపత్రాల జారీలో జాప్యం లేదు

కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీ విషయంలో జాప్యం లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. మీ సేవా కేంద్రాల నుంచి దరఖాస్తులు రాగానే వెంటనే అప్రోవల్ చేస్తున్నాం. సర్వర్ ప్రాబ్లం ఉన్న సమయాల్లో కొంత ఆలస్యం అవుతోంది. ప్రస్తుతం సర్వర్ సమస్య లేదు. దీంతో ధ్రువపత్రాల జారీలో వేగవంతం చేశాం.

– ఎం.శ్రీనివాస్, తహసీల్దార్ వట్‌పల్లి